కింగ్‌కోఠిలోని డ్రైనేజీ సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావన

- సమస్యను పరిష్కరించాలన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 15: హిమాయత్‌నగర్ డివిజన్ కింగ్‌కోఠి, షేర్ ఘాట్‌లో తీవ్రతరమైన మురుగునీటి సమస్యను పరిష్కరించి మురుగు సాఫీగా వెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రభుత్వ జిల్లా దవాఖాన ముందు మురుగు నీరు పొంగిపొర్లడం వల్ల రోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కింగ్‌కోఠి నుంచి హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు మురుగు నీరు సాఫీగా వెళ్లడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి జీహెచ్‌ఎంసీ,జలమండలి అధికారులను సమన్వయం చేసి మురుగు నీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

21 నుంచి మాదిగ జోడో యాత్ర

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : తెలంగాణ మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మాదిగ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు మాదిగ జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 2 లోక్‌సభ స్థానాలు, ఒక జనరల్ సీటు కేటాయించాలన్నారు. ఆరు రోజుల పాటు జరిగే మాదిగ జోడో యాత్ర అమీర్‌పేటలో ప్రారంభమవుతుందని, పది జిల్లాల హెడ్‌క్వార్టర్స్‌లో కొనసాగుతుందన్నారు. రెండో విడుతలో 50 అసెంబ్లీ, మూడో విడుతలో 17 లోక్‌సభ స్థానాల్లో యాత్ర సాగుతుందన్నారు. ఆయన వెంట బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ బోర్దెల్లి సురేశ్, తదితరులు ఉన్నారు.

సంత్ సేవాలాల్ బోధనలు ఆచరణీయం

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్
- ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు



సంత్ సేవాలాల్ మహరాజ్‌కు నివాళులర్పిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15 : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు ప్రతి ఒక్కరూ అచరించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో గురువారం నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలు ఎంతో ఉన్నతమైనవన్నారు. జీవహింసకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతోపాటు మద్యపానం, ధూమపానం లాంటి చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని సూచించినట్లు గుర్తుచేశారు. సేవాలాల్ బోధనలను యువత అర్థం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బాబానాయక్, వెంకటస్వామి, రతన్, ఆంటోనీ, తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో..

ఎర్రగడ్డ : సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం బోరబండలో ఘనంగా నిర్వహించారు. వీకర్‌సెక్షన్ కాలనీలోని సేవాలాల్ ఆలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బోరబండతో పాటు పరిసర ప్రాంతాల బంజారాలు తరలివచ్చారు. అంతకుముందు ఎర్రగడ్డ నుంచి బోరబండ వరకు సేవాలాల్ విగ్రహాన్ని ఊరేగించారు. సేవాలాల్ ఆలయంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, గోవింద్, రమేశ్‌నాయక్, రంగానాయక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త.. సేవాలాల్ మహరాజ్

శంషాబాద్ రూరల్ : బంజరాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు గురువారం మండలంలోని పెద్దషాపూర్ తండా, అలీకోల్‌తండాలో ఘనంగా నిర్వహించారు. అలీకోల్‌తండాలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కే చంద్రారెడ్డి, జిల్లా నాయకుడు నీరటి రాజుముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ సంఘసంస్కర్త, ఆధ్యాత్మిక గురువు, బంజారాల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షకుడు అని కొనియాడారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌నాయక్, రవీందర్‌నాయక్, రాజునాయక్, హేమ్లానాయక్, గిరిజనులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీలో..

సేవాలాల్ జయంతి వేడుకలను శంషాబాద్ మున్సిపాలిటీలోని ఎయిర్‌పోర్టు కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గిరిజన ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్,ఎంఈఓ అంకూర్‌నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు, బంజారాబంజారా నాయకులు రమేశ్‌నాయక్, రవిపావార్, వెంకట్‌రాథోడ్, సుక్యానాయక్, మోతీలాల్‌నాయక్, బీమ్లానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, తదితరరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌కు నివాళి

బండ్లగూడ : బంజారా హక్కుల సాధన కోసం పోరాడిన సేవాలాల్‌ను బంజారాలంతా గుర్తు చేసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా గురువారం బండ్లగుడలోని ఎస్టీ హాస్టల్ వద్ద విద్యార్థులతో కలిసి సేవాలాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాలాల్ సేవలను కొనియాడారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి : సేవాలాల్ మహరాజ్ సేవలు ఎంతో గొప్పవని బీజేపీ యువజన నాయకుడు రమేశ్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సంత్‌సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో గోపాల్‌నాయక్, కిషన్‌నాయక్, సంతుగౌడ్, శేఖర్, మురళీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్‌లో..

జూబ్లీహిల్స్ : రహ్మత్‌నగర్‌లో గురువారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీఆర్ హిల్స్ ఇంద్రానగర్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, తదితరులు

శంషాబాద్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓ అంకూర్‌నాయక్, పాల్గొన్న గిరిజన నాయకులు

సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన లక్ష్మీనివాస్, తదితరులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా..

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

సుల్తాన్‌పల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి .ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి గ్రామానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరయ్యారు. గురువారం మంజూరు చేసిన పత్రాలను సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారికి ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం అవసరమైన నిధులు విడుదల చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. 2009 నుంచి శంషాబాద్ మండలంలోని గ్రామాలకు కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి చేశానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్, పాండురంగారెడ్డి, వీరేశం, సిద్ధయ్య, భీష్మాగౌడ్, సిద్ధుఖ్, కృష్ణ, ఈశ్వరయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా జానకిరాములు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 15 : ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా జానకిరాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఎస్‌ఆర్ నగర్ డీఐగా పనిచేస్తున్న రఘురాములు ఫిలింనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో నల్లగొండ సీఐడీ విభాగంలో పనిచేస్తున్న జానకిరాములును ఎస్‌ఆర్ నగర్ డీఐగా నియమించారు.

దేశంలో అభివృద్ధిని విస్మరించిన కేంద్రం

- 18న ఇందిరాపార్కు వద్ద ధర్నా

హైదర్‌గూడలో మాట్లాడుతున్న నయీముల్లా షరీఫ్, తదితరులు

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిందని ఉమ్మడి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్, ఎస్సీ,ఎస్టీ,బీసీ,ముస్లిం ఫ్రంట్ కన్వీనర్ సనాఉల్లాఖాన్, ప్రతినిధులు నయీముల్లా షరీఫ్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ ఆరోపించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలు, కేంద్రం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ఈనెల18న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యల్లో తరలిరావాలని పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో వెంట ఫ్రంట్ నేతలు సలీం హైమద్, మసూద్ అలీ, సలీంమాల్ హిందీ, తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

బండ్లగూడ, ఫిబ్రవరి 15 : మద్యం సేవించి వాహనాలు నడపడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కోర్టు పలు శిక్షలను విధించింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ గురువారం వివరాలు వెల్లడించారు. ఇటీవల మద్యం సేవించి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన ఏడుగురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ప్రత్యేక మెట్రోపాలిటన్ కోర్టులో హజరుపరిచామన్నారు. న్యాయమూర్తి నజీరుద్దున్‌షా ఒకరికి 7 రోజులు, ఇంకొకరికి 5 , మరొకరికి 4 రోజుల జైలుశిక్ష విధించారు. మిగిలిన నలుగురికి రూ. 10వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు

వెంగళరావునగర్,ఫిబ్రవరి 15: ఎల్లారెడ్డిగూడ, సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన న్యాయవాది విక్రమ్‌యాదవ్‌ను బెదిరించిన వారిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన న్యాయవాది విక్రమ్‌యాదవ్ బుధవారం ఉదయం ఎల్లారెడ్డిగూడ రోడ్డుపై వెళ్తుండగా నలుగురు వ్యక్తులు అడ్డగించారు. సంజయ్ గాంధీనగర్ విష్ణుకు చెందిన భూ వివాదం నుంచి తప్పుకోకపోతే చంపేస్తామని బెదిరించారు. రూపేశ్ చెప్పమన్నాడని బెదిరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింఘానియాస్‌లో ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15 : బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లోని సింఘానియాస్‌లో సరికొత్త రెడీ టు వేర్ కలెక్షన్లను గురువారం టాలీవుడ్ హీరోయిన్ అశ్విని శ్రీ, పలువురు మోడల్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. కళ్లు మిరుమిట్లు గొలిపే డిజైనర్ కలెక్షన్స్‌ను ధరించిన మోడల్స్ హొయలు ఒలికించారు. సందర్భకులను ఆకట్టుకున్నారు.

మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాసానికి బ్రేక్!

బండ్లగూడ, ఫిబ్రవరి 15 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై పలువురు కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసానికి బ్రేక్ పడింది.

కార్పొరేషన్ పరిధిలో మొత్తం 22 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో 6వ నంబర్ కార్పొరేటర్ సుల్తాన బేగం అనారోగ్యంతో మరణించింది. మిగిలిన 21 మంది కార్పొరేటర్లలో 16 మంది అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖను అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం (16న) అవిశ్వాస సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అయితే మేయర్ మహేందర్‌గౌడ్ ఈ విషయంపై కోర్టులో ఫిల్ దాఖాలు చేయడంతో కోర్టు అవిశ్వాసాన్ని నిలిపివేయాలని ఉత్తర్వులను జారీ చేసినట్లు కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు.

మణికొండ మున్సిపాలిటీలో క్యాంపు రాజకీయాలు

- గోవాకు తరలిన 12మంది అసమ్మతి కౌన్సిలర్లు

మణికొండ, ఫిబ్రవరి 15 : మణికొండ మున్సిపాలిటీలో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. గత కొన్నిరోజులుగా మున్సిపల్ చైర్మన్‌ను గద్దె దింపేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ, స్వతంత్ర్య కౌన్సిలంతా కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్‌కు విన్నవించిన విషయం తెలిసిందే. స్పందించిన అధికార యంత్రాంగం అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్ల సంతకాల సేకరణతోపాటు ఈనెల 22న అవిశ్వాసం తీర్మానం పెట్టనున్నట్లు నోటీసులు జారీ చేశారు. దాంతో మెజార్టీ కౌన్సిలర్లంతా క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. బీఆర్‌ఎస్-6, బీజేపీ-4, ఇండిపెండెంట్-1, కాంగ్రెస్ అసమ్మతి కౌన్సిలర్ ఒకరితో కలిసి 12 మంది గురువారం గోవాకు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మొత్తం 8 మంది ఉండగా వీరిలో నుంచి ఒక్క కౌన్సిలర్ అసమ్మతి వర్గంలో చేరితేనే అవిశ్వాసం నెగ్గే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఎనిమిది మంది ఏకపక్షంగా ఉంటే అవిశ్వాసం వీగిపోతుంది. దీంతో ఆ ఒక్క కౌన్సిలర్ ఎవరన్నదీ అర్థం కానీ పరిస్థితి.

కిక్ బాక్సింగ్‌లో యశశ్రీకి బంగారు పతకం

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15: విద్యార్థులు ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి విజయాలు సాధించాలని కిక్ బాక్సింగ్ మాస్టర్ మైపాల్ అన్నారు. ఢిల్లీ ఇందిరా గాంధీ స్టేడియంలో ఇటీవల జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో దుర్గా హిల్స్‌లోని ఫ్లయింగ్ స్టార్ బ్యాడ్మింటన్ అకాడమీ విద్యార్థులు రావుల యశశ్రీ, అఖిల్ సత్తాచాటారు. రావుల యశశ్రీ బంగారు పతకం, అఖిల్ బ్రౌంజ్ పతకాలను సాధించారు. ఈ సందర్భంగా అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యశశ్రీ, అఖిల్‌ను మాస్టర్ మైపాల్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిక్‌బాక్సింగ్ ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు కరాటే, కిక్ బాక్సింగ్ నేర్చుకోవాలన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.



కిక్ బాక్సింగ్‌లో పతకాలు సాధించిన రావుల యశశ్రీ, అఖిల్

బాలుడి మృతి కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15: జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5లోని దుర్గాభవానీ నగర్ బస్తీలో పదేళ్ల బాలుడి అనుమానాస్పద మృతి కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నది. మంగళవారం రాత్రి 8.30 సమయంలో ఇంట్లోంచి ఆడుకునేందుకు బయటకు వెళ్లిన మునావత్ కార్తిక్ బుధవారం ఉదయం సమీపంలోని జీహెచ్‌ఎంసీ పార్కులోని నాలాలో శవమై తేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. బాలుడి తలపై ముందుభాగంలో బలమైన గాయం ఉండటంతో పాటు ఊపిరితిత్తుల్లోకి మురుగునీరు చేరిందని వైద్యులు గుర్తించారు. నాలుగు అడుగుల ఎత్తైన నాలా మీద నుంచి బోర్లా పడి ఉండవచ్చని, మురుగులో ఇరుక్కుపోయి శ్వాస తీసుకోలేక మరణించి ఉండవచ్చని పోస్ట్‌మార్టం నిర్వహించిన వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. అయితే చీకటిగా ఉండే పార్కు లోపలికి కార్తిక్ ఎలా వెళ్లాడు? ఎవరైనా తీసుకువెళ్లారా? అనే విషయాన్ని తేల్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. సీసీ ఫుటేజీని సేకరిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15: అనుమాననాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలికి చెందిన మంగలి కృష్ణయ్య, బాలమ్మ(65) భార్యాభర్తలు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వేణుగోపాల్ మౌలాలిలో, కూతురు మైలార్‌దేవ్‌పల్లిలో ఉంటున్నారు. కొంతకాలంగా బాలమ్మ మైలార్‌దేవ్‌పల్లిలోని కూతురు వద్దే ఉంటున్నది. ఈనెల 14న రేషన్ షాపుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పిన బాలమ్మ రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం కాటేదాన్‌లోని మోహన్‌రెడ్డి టిఫిన్ సెంటర్ వద్ద బాలమ్మ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీంతో పోలీసులు బాలమ్మ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ విద్యావిధానంతో చదువులు నిర్వీర్యం

- ప్రొఫెసర్ హరగోపాల్

విద్యార్థుల సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : విదేశాల్లో విద్యాసంస్థలను ప్రభుత్వాలే నిర్వహిస్తాయని, మన దేశంలో మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థలే అధిక సంఖ్యలో విద్యావ్యవస్థను నడిపిస్తున్నాయని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. భారత్ బచావ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థుల సదస్సు పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ హరగోపాల్ ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, భారత బచావ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు గాదె ఇన్నయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విదానంలో అనేక లోపాలున్నాయన్నారు. వీటిని కొటారి కమిషన్‌కు పూర్తిగా వ్యతిరేకంగా రూపొందించారని అన్నారు. పేదలు, సామాన్యులు చదువుకునే పరిస్థితి లేదని, పిల్లలందరికీ సమాన విద్య అందాలంటే ఇలాంటి విద్యావిధానాలను విరమింపజేయాలన్నారు. ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ మాట్లాడుతూ కేంద్రం విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తూ, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో ప్రజాస్వామిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారన్నారు. సదస్సులో భారత్ బచావ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు బంజర్ల రమేశ్‌బాబు, విద్యావంతుల వేదిక ప్రతినిధి రామగిరి ప్రకాశ్, ధనలక్ష్మి, ప్రభాకర్, శ్రావణ్, గణేశ్, జయసూర్య, శ్రీహరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 15 : నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు తీసుకునే ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసు కోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ముగియక ముందే వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్లను తీసుకునేందుకు ఆఫర్ల పేరుతో తల్లిదండ్రులను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమానులు మభ్యపెడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతోనే ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు చేసే ఆగడాలకు అదుపులేకుండా పోతుందని, ఆయా యజమాన్యాల ముందస్తు అడ్మిషన్లు నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్పత్తుల్లో నాణ్యత లేదంటూ.. బేకరి నిర్వాహకులకు బురిడీ

బంజారాహిల్స్,ఫిబ్రవరి 15: మీ ఉత్పత్తులు నాణ్యతతో లేవని ఫిర్యాదుల రావడంతో కేసు నమోదైందంటూ బేకరీ నిర్వాహకులను నమ్మించి డబ్బులు దండుకున్న సైబర్ నేరగాళ్లపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని లెబోనాల్ బేకరీ డైరెక్టర్ సయ్యద్ అబ్దుల్‌అలీకి నాలుగు రోజుల క్రితం రంజిత్ మాన్‌సింగ్ అనే వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ అసిస్టెంట్ కమిషనర్‌ను అని, మీ ఉత్పత్తుల నాణ్యతపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని, వెంటనే రూ.80 వేలు జరిమానా చెల్లించాలని, లేకపోతే నోటీసులు అందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కుమార్తె పెండ్లి హడావుడిలో ఉన్న అబ్దుల్ అలీ వారు సూచించిన నంబర్‌కు రూ.80వేలు గూగుల్ పే చేశాడు. రెండ్రోజుల తర్వాత ఈ వ్యవహారంపై అనుమానం వచ్చి వాకబు చేయగా సైబర్ నేరగాళ్లు తనను మోసం చేసి డబ్బులు కాజేశారని గుర్తించాడు. దీంతో నిందితులపై చర్యలు తీసుకోవాలని గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15 : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పోరాడుతుందని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. గురువారం కాటేదాన్ శ్రీరామ్‌నగర్ కాలనీ ఇండస్ట్రీ ఏరియాలో శుక్రవారం జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పల్లె శ్రీనివాస్, స్వామి, లక్ష్మణ్, సహదేవ్, రమ్య, శ్రీదేవి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

18న జాతీయ సెమినార్

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 15: సిటిజెన్స్ లీగల్ అకాడమీ ఆధ్వర్యంలో 18న 'ప్రజాస్వామ్యంలో న్యాయం దాని ప్రాముఖ్యత' అనే అంశంపై నాంపల్లి నెహ్రూ ఆడిటోరియంలో సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సీఎల్‌ఏ అధ్యక్షుడు యూసుఫ్ బేగ్ తెలిపారు.

దళిత క్రిస్టియన్లపై దాడి చేసిన వారిని శిక్షించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 15: చర్చిని ధ్వంసం చేసి, దళిత క్రిస్టియన్లపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కుట్రపూరితంగా కర్రలు, రాళ్లు, ఇనుపరాడ్లతో దళిత క్రిస్టియన్లపై దాడి చేసి మెథడిస్ట్ చర్చిని సైతం ధ్వంసం చేశారని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన, సహకరించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సతీశ్‌కుమార్, నాయకులు సుబ్బారావు, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో నిరసన ప్రదర్శన

బంజారాహిల్స్ : రంగారెడ్డి జిల్లా మోకిల సమీపంలోని జన్వాడలో క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఖైరతాబాద్ నియోజకవర్గ ఫాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

గురువారం ఫిలింనగర్‌లోని మహనీయుల విగ్రహాల చౌరస్తా వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాస్టర్లు, క్రైస్తవ సంఘాల సభ్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పీటర్, రెవరెండ్ ఎం.ప్రభుదాస్, రవి, జీవానందం, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

మణికొండ, ఫిబ్రవరి 15: మణికొండ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌కుమార్‌ను గురువారం ఆల్‌కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీ. సీతారామ్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆంజనేయులు,బాబురావు, రాజారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ ఆర్.ఆర్. జిల్లా, శంషాబాద్ మండలం, తొండపల్లి గ్రామం, ధరణి ఎన్‌క్లేవ్ వద్దగల సర్వే నం. 41/A/1, 40/AA & 41AAలోని 200 చ.గజాల విస్తీర్ణపు నం.40 గల ఖాళీ ప్లాట్, **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం.41, **దక్షిణం:** ప్లాట్ నం.39, **తూర్పు:** ప్లాట్ నం.43, **పశ్చిమం:** 30 అడుగుల వెడల్పు రోడ్ గల దానిని, దాని యజమాని మరియు స్వాధీనదారు శ్రీ నరేందర్ సురాన జైన్ తండ్రి రమేష్ చంద్ సురాన జైన్ గారి నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు మరియు నా క్లయింట్ భూమి యజమానికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించారు మరియు అతని పేరున రిజిస్టర్డ్ సేల్ డీడ్ పొందుటకు ఉద్దేశిస్తున్నారు. మరియు ఎవరైనా పై సదరు ప్లాట్‌పై ఏదేని క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం లేదా స్వాధీనత కలిగి ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (5) రోజులలోగా దిగువ సంతకందారుకు సంబంధిత డాక్యుమెంటరీ రుజువుతో వారి అభ్యంతరాలను దాఖలు చేయవలెను, లేనిచో అమ్మకం లావాదేవిని పూర్తి చేస్తారు మరియు ఆ తరువాత ఎలాంటి అభ్యంతరాలు పరిగణించబడవు.

తేది: 15-02-2024

సం/- **డి. సంగప్ప, B.Sc., LL.B,** అడ్వొకేట్
ఫ్లాట్ నం. 103, శ్రీ వెంకటసాయి నిలయం, ప్లాట్ నం.149, స్నేహిత హిల్స్, ఫేజ్-I, పీరంచెరు, PBEL సిటీ దగ్గర, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, గండిపేట మండలం, ఆర్.ఆర్.జిల్లా-500086, తెలంగాణ.
ఇ-మెయిల్: sangappa5979@gmail.com
సెల్: 9666135775

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ ఆర్.ఆర్. జిల్లా, శంషాబాద్ మండలం, తొండపల్లి గ్రామం, ధరణి ఎన్‌క్లేవ్ వద్దగల సర్వే నం. 41/A/1, 40/A/2, 14/AA/1 & 41AAలోని 200 చ.గజాల విస్తీర్ణపు నం.37 గల ఖాళీ ప్లాట్, **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం.38, **దక్షిణం:** ప్లాట్ నం.36, **తూర్పు:** ప్లాట్ నం.46, **పశ్చిమం:** 30 అడుగుల వెడల్పు రోడ్ గల దానిని, దాని యజమాని మరియు స్వాధీనదారు శ్రీ మహ్మద్ షోయబ్ తండ్రి మహ్మద్ బాసిత్ గారి నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు మరియు నా క్లయింట్ భూమి యజమానికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించారు మరియు అతని పేరున రిజిస్టర్డ్ సేల్ డీడ్ పొందుటకు ఉద్దేశిస్తున్నారు. మరియు ఎవరైనా పై సదరు ప్లాట్‌పై ఏదేని క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం లేదా స్వాధీనత కలిగి ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (5) రోజులలోగా దిగువ సంతకందారుకు సంబంధిత డాక్యుమెంటరీ రుజువుతో వారి అభ్యంతరాలను దాఖలు చేయవలెను, లేనిచో అమ్మకం లావాదేవిని పూర్తి చేస్తారు మరియు ఆ తరువాత ఎలాంటి అభ్యంతరాలు పరిగణించబడవు.

తేది: 15-02-2024

సం/- **డి. సంగప్ప, B.Sc., LL.B,** అడ్వొకేట్
ఫ్లాట్ నం. 103, శ్రీ వెంకటసాయి నిలయం, ప్లాట్ నం.149, స్నేహిత హిల్స్, ఫేజ్-I, పీరంచెరు, PBEL సిటీ దగ్గర, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, గండిపేట మండలం, ఆర్.ఆర్.జిల్లా-500086, తెలంగాణ.
ఇ-మెయిల్: sangappa5979@gmail.com
సెల్: 9666135775